వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశ్యం

జ్యోత్స్న(ఫైల్)

దుండిగల్, మార్చి 21: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, మామిడిపల్లి గ్రామానికి చెందిన కర్రి అశోక్, జ్యోత్స్న (23) దంపతులు. అశోక్ ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో ఉపాధి నిమిత్తం మహానగరానికి వలసవచ్చాడు. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్‌పరిధి,సూరారం కాలనీలోని సుభాశ్‌చంద్ర బోస్‌నగర్‌లో నివాసముంటున్నాడు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అశోక్ భార్య జ్యోత్స్న ఫిబ్రవరి 20న వచ్చింది. దంపతులు ఇద్దరు అన్యోన్యంగానే ఉంటున్నారు. అయితే ఈనెల 18వ తేదీన విధులు ముగించుకుని రాత్రి 8:30 గంటల సమయంలో ఇంటికి వచ్చిన అశోక్‌కు భార్య కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాలతోపాటు బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీశాడు. ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో బాలిక అదృశ్యం.. కిడ్నాప్ కేసు


నాన్సీ(ఫైల్)

సూరారం కాలనీలోని రెండవ ఓం జెండా వద్ద కిరాణ షాపు నిర్వహిస్తున్న మనోజ్ కచ్వా కూతురు నాన్సి(16) ఈ నెల 20న పక్కనే ఉంటున్న తన నానమ్మ దగ్గరకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లింది. అయితే రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో మనోజ్ ఆరా తీయగా అక్కడికి వెళ్లనట్లు తేలింది. స్వగ్రామం అయిన రాజస్థాన్‌లో బన్సిలాల్ అనే యువకుడు ప్రేమపేరుతో వెంటపడేవాడని, అతడిపై అక్కడి నాగోర్, గాంధీచౌక్ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు మనోజ్‌కచ్వా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనే రాజస్థాన్ నుంచి వచ్చి తన కూతురిని తీసుకెళ్లి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేయగా.. పోలీసులు కిడ్నాప్, అదృశ్యం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది రోజుల్లో రూ.55.75 కోట్ల లక్ష్యం

- వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటారా?
- ఆస్తిపన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్
- 90 శాతం వడ్డీ రాయితీపై అవగాహన

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 21: ఈ యేడాది ఆర్థిక సంవత్సరం మరో పది రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. వంద శాతం ఆస్తిపన్ను వసూళ్లు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఓ వైపు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు, మరోవైపు ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించిన యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా కసరత్తు చేస్తున్నారు. సర్కిళ్ల వారీగా ఉప కమిషనర్లు, రెవెన్యూ సిబ్బంది సమావేశాలు నిర్వహిస్తూ రోజువారి, డాకెట్ల వారీగా లక్ష్యాలను పెట్టుకుని ఆ లక్ష్యాలను చేరుకునేలా ముందుకు సాగుతున్నారు. నిర్దేశించిన గడువులోగా వందశాతం లక్ష్యాన్ని సాధించడంపై దృష్టి సారించారు.

జంట సర్కిళ్లలో రూ.55.78 కోట్ల బకాయిలు

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో ఈ వార్షిక యేడాదిలో రూ.220.23 కోట్ల ఆస్తి పన్నులను వసూళ్లు చేయాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను లక్ష్యాన్ని నిర్దేశించారు. మూసాపేట సర్కిల్‌లో రూ.119.22 కోట్లు, కూకట్‌పల్లి సర్కిల్‌లో రూ.100.91 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. కాగా.. మూసాపేట సర్కిల్‌లో రూ.91.04 కోట్లు, కూకట్‌పల్లి సర్కిల్‌లో రూ.73.17 కోట్లు వసూలు చేయగా.. రెండు సర్కిళ్లలో ఇప్పటి వరకు రూ.164.2 కోట్ల ఆస్తి పన్నులను వసూళ్లు చేశారు. మూసాపేట సర్కిల్‌లో రూ.28.18 కోట్లు, కూకట్‌పల్లి సర్కిల్ రూ.27.74 కోట్ల బకాయిలను వసూళ్లు చేయాల్సి ఉన్నది. రెండు సర్కిళ్లలో కలిపి ఈ పది రోజుల్లో రూ.55.78 కోట్ల ఆస్తిపన్నులను వసూళ్లు చేయాల్సి ఉన్నది.

వడ్డీ రాయితీపై అవగాహన..

జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తిపన్ను మొండి బకాయిదారులకు వన్‌టైమ్ స్కీమ్‌లో భాగంగా వడ్డీపై 90 శాతం రాయితీని ప్రకటించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది మొండి బకాయిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని డాకెట్ల వారీగా మొండి బకాయిదారులను గుర్తించి ఫోన్లు, ఎస్ఎంఎస్ ల ద్వారా సమాచారాన్ని అందిస్తున్నారు. వ్యాపార సముదాయాలు, పరిశ్రమల నిర్వాహకులను కలుస్తూ సకాలంలో పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. మొండి బకాయిదారులకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ చట్టం అండర్ సెక్షన్ 269 ఆఫ్ ది జీహెచ్ఎంసీ యాక్ట్ 1955 ప్రకారం రెడ్ నోటీసులను జారీ చేస్తూ ఆస్తులను జప్తు చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. మొండిగా వ్యవహరిస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరికలు చేస్తున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి..

సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్తులు కావాలని కోరుతున్నాం. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే మొండి బకాయిదారులను గుర్తించి నోటీసులు జారీ చేశాం. ఈ యేడాది గూగుల్ పే, ఫోన్ పే, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా ఆస్తిపన్ను చెల్లించే అవకాశం కల్పించారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్నులు చెల్లించాలని కోరుతున్నాం. ఈ ఏడాది పెరిగిన ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని వందశాతం చేరుకుంటాం. పన్ను చెల్లింపు దారులు సహకరించి వెంటనే పన్నులు చెల్లించాలని కోరుతున్నాం.

– రమేశ్, వాల్యుయేషన్ ఆఫీసర్, మూసాపేట సర్కిల్

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

దుండిగల్, మార్చి 21 : ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్)లోకి పరిసర ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇన్‌కాయిస్ డైరెక్టర్ శ్రీనివాస కుమార్ అన్నారు. గురువారం రెవెన్యూ, హెచ్ ఎండబ్ల్యూఎస్‌అండ్‌ఎస్‌బీ(జలమండలి, సీవరేజ్ బోర్డు), జీహెచ్ఎంసీ, పీసీబీ అధికారులతో కలిసి ఆయన సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాలతోపాటు సమీపంలోని కైసర్‌నగర్‌లోని డ్రైనేజీ ఇన్‌కాయిస్‌లోకి చేరడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారుతున్నాయన్నారు. సంబంధి అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మండలం గిర్దావర్ రజనీకాంత్‌తోపాటు బీజేపీ నేత డా.ఎస్.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కైసర్‌నగర్ పరిసర ప్రాంతాలనుండి ఇన్‌కాయిస్‌లోకి ప్రవేశిస్తున్న మురుగునీటి ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

నీటి సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్

మాదాపూర్,మార్చి 21: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం నీటి యొక్క ప్రాముఖ్యత, నీరు వృథా, కలుషితం కాకుండా చూడటానికి అవగాహన కల్పించేందుకు జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్ చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... ప్రపంచ వ్యాప్తంగా మార్చి 22వ తేదీన ఐక్య రాజ్య సమితి వారి సూచనల మేరకు ప్రపంచ నీటి దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. దీని ఉద్దేశం నీటి ప్రాముఖ్యత, సంరక్షణను గురించి అవగాహన కల్పించడమని చెప్పారు. కావున ప్రతి ఒక్కరు నీటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ మారబోయిన సదానంద్‌యాదవ్, సభయలు పాలం శ్రీను, వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రావు, జీవీ రావు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

■ ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సూరారం కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

దుండిగల్, మార్చి 21 : మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి సూరారంలోని కట్టమైసమ్మ ఆలయంతో పాటు దుండిగల్‌లోని సింగాపురం మైసమ్మ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎంఎల్ ఆర్ఐటీలో సీఎస్ఐ ఛాప్టర్ బాడీ ఆవిష్కరణ


సీఎస్ఐ ఛాప్టర్ బాడీ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

దుండిగల్, మార్చి 21: విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే లక్ష్యంగా మర్రిలక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ)కళాశాల ముందుకు వెళ్తుందని కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో 'టెక్‌కనెక్ట్' పేరుతో సీఎస్ఐ ఛాప్టర్ బాడీని గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. శోధించు, ఆవిష్కరించు, సమాజానికి అందించు అనే నినాదంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి, డీన్ డా.రాధికాదేవి, సీఎస్ఈ విభాగాధిపతి బలరాం, ఏఐఎంఎల్ విభాగాధిపతి కే.సాయిప్రసాద్, ఐటీ విభాగాధిపతి డా.ఎన్‌వీ.రాజశేఖర్‌రెడ్డి, సీఎఐటీ విభాగాధిపతి డా.పీ.సుభాషిణీ, డేటాసైన్స్ విభాగాధిపతి చిరంజీవి మాణికే తదితరులు పాల్గొనగా.. గౌరవ అతిథిగా కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి, ఐఈటీఈ ఎగ్జిక్యూటివ్ సభ్యులు డా.ఏవీ,కృష్ణప్రసాద్ హాజరై కళాశాలలోని విద్యార్థులకు చాప్టర్ బాడీ గురించి వివరించారు.

ఇటీవల తన మాతృమూర్తిని కోల్పోయిన సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణను గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తల్లి అంజమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో పాటు ఆమె కుటుంబసభ్యులను రాగిడి ఓదార్చారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

– దుండిగల్, మార్చి 21

■ ప్రతి గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం

ఉచిత హోమియో వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 21: కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ప్రతి గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు, ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, హైదరాబాద్ హోమియో క్యూర్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి సలహాలు, సూచనలు అందించారు. వచ్చే గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ దద్దోజు నాగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు పాండురంగాచారి, ఫణిబాబు, శ్రీనివాస్, తిరుపతిచారి, లింగయ్య, బుచ్చయ్య, సాంబశివరావు, బ్రహ్మచారి తదితరులున్నారు.

నిజాంపేట్ మేయర్‌ను కలిసిన ఆటో యూనియన్

తెలంగాణ గార్బేజ్ ఆటో కార్మిక సంఘం సభ్యులు గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డిని హిల్‌కౌంటీలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్‌కు సంబంధించిన స్వచ్ఛ ఆటో కార్మికులు నూతనంగా 'తెలంగాణ ఆటోగార్బేజ్ యూనియన్'గా ఏర్పాటైన నేపథ్యంలో ఈనెల 24వ తేదీన వారి ఆధ్వర్యంలో నిర్వహించే యూనియన్ జెండా ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించాలని కోరారు. ఇందుకు మేయర్ సానుకూలంగా స్పందించారు. – దుండిగల్, మార్చి 21

బీఎల్ ఓలకు అవగాహన

కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో బీఎల్ఓలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు

కుత్బుల్లాపూర్, మార్చి 21: జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏండ్లు దాటి ఉన్న వృద్ధులతోపాటు అర్హులైన దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునేలా గుర్తించేలా బీఎల్ఓలు తగు చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు సూచించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో బీఎల్ఓలతో జరిగిన సమావేశంలో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎల్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

పలు బెల్ట్‌షాపులపై ఎస్ఓటీ దాడులు

కుత్బుల్లాపూర్, మార్చి21:ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి పత్రాలు లేకుండా ఓ ట్రాలీ ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని మేడ్చల్ ఎస్ఓటీ బృందం పట్టుకున్నారు. కొంపల్లిలో కమాన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వెళ్లే దారి నుంచి ట్రాలీ ప్యాసింజర్ ఆటోలో తరలిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ ఎస్ఓటీ బృందం చేపట్టిన తనిఖీల్లో పట్టుబడింది. ఈ క్రమంలో ఆటోలో తరలిస్తున్న 480 లీటర్ల బట్‌వైజర్ బాటిల్స్ పట్టుబడడంతో పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు.

బెల్ట్‌షాపులపై దాడులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు బెల్ట్‌షాపులపై బాలానగర్, మేడ్చల్ ఎస్ఓటీ బృందాలు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 55.8 లీటర్ల మద్యం, దుండిగల్ పీఎస్ పరిధిలో 6.43 లీటర్ల మద్యాన్ని పట్టుకొని ఆయా పోలీస్‌స్టేషన్లకు అప్పగించగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం పగులగొట్టి నగదు, బంగారం చోరీ

జగద్గిరిగుట్ట, మార్చి 21 : ఇంటితాళం పగులగొట్టి బంగారం, నగదు చోరీ చేసిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలో మఖ్సూద్ కుటుంబంతో నివాసముంటాడు. ఈనెల 17న ఉప్పల్‌లోని బంధువుల ఇంట్లో వివాహానికి కుటుంబ సభ్యులందరూ కలిసి వెళ్లారు. ఆపై బుధవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి కనిపించడంతో ఇంట్లో పరిశీలించారు. బీరువా తెరిచి ఉండగా ఉందులో ఉండాల్సిన నగదు, నగలు కనిపించలేదు. సంఘటనలో రూ.4లక్షల నగదు, 18 తులాల బంగారం చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించగా గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తాం

అల్లాపూర్, మార్చి 21: కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మూసాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీ అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

విల్లాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

నిర్మాణాల వద్ద బీజేపీ నిజాంపేట్ కమిటీ ప్రతినిధులు

దుండిగల్,మార్చి21: నిబంధనలకు విరుద్ధంగా కన్జర్వేషన్ జోన్‌లో విల్లాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ కమిటీ డిమాండ్ చేసింది. కార్పొరేషన్ పరిధిలోని స్ప్రింగ్‌వ్యాలీలో గురువారం బీజేపీ ప్రతినిధులు పర్యటించారు. ఈ సందర్భంగా 2022 సెప్టెంబర్‌లో అనుమతులు లేవంటూ కూల్చివేసిన ప్రాంతంలోనే మళ్లీ విల్లాల నిర్మాణాలు ఏ విధంగా జరుగుతున్నాయని ప్రశ్నించారు. బిల్డర్ల ధనదాహం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్క్ స్థలం, ఓపెన్ ప్లేస్‌లో వెలిసిన ప్లాట్లకు అధికారులు అనుమతులు జారీ చేయడం దారుణమన్నారు. కోట్లాది రూపాయల స్థలానికి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఎలా జారీ చేస్తారన్నారు. పైగా జీ+ 1 ఫ్లోర్‌కు ఆనుమతులు తీసుకుని జీ+2 నిర్మిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారన్నారు. ఈ అక్రమాలపై భారతీయ జనతా పార్టీ, కాలనీ అసోసియేషన్ పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవడంలేదన్నారు. స్ప్రింగ్ వ్యాలీ కాలనీ ఓపెన్ స్పేస్ కన్జర్వేషన్ జోన్ నిషేధితల జాబితాలో ఉన్న కోట్లాది రూపాయల భూమి ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్, నిర్మాణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అక్రమంగా నిర్మిస్తున్న 8 విల్లాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు అనుమతులను వెంటనే రద్దు చేసి బిల్డర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బీజేపీ కమిటీ అధ్యక్షులు ఆకుల సతీశ్, సెక్రటరీ అరుణ్‌రావు, కిసాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్‌రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబీసీ ప్రధాన కార్యదర్శి ముఖేష్, కాలనీ అధ్యక్షుడు శర్మ, నరోత్తంరెడ్డి, రాము, కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఐడీఎస్‌తో ఒప్పందం చేసుకుంటున్న సెయింట్ పీటర్స్ కళాశాల కార్యదర్శి టీవీరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత

మేడ్చల్, మార్చి 21: విద్యార్థి దశలో నైపుణ్యాలను పెంపొందిచుకుంటేనే ఉన్నత భవిష్యత్ ఉంటుందని గుండ్లపోంచపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. గురువారం కళాశాల ప్రముఖ బహుళ జాతి సంస్థ ఇన్ఫర్మేషన్ అండ్ డేటా సిస్టమ్స్(ఐడీఎస్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను నేరుగా పరిశ్రమకు పని చేసే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.ఎమర్జింగ్ టెక్నాలజీస్ అయిన బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ అంశాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, టీపీవో డాక్టర్ శ్రీకాంత్, ఏవో అనురాగ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, హెనోటిక్ సొల్యూషన్స్ ఫౌండర్ మల్లేశ్, ఐడీఎస్ బిజినెస్ స్ట్రాటజీ హెడ్ సునీల్ సుబ్రహ్మణ్యం, పీఆర్‌వో రవి సుధాకర్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపునకు సాంకేతిక సదస్సులు దోహదం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి

మేడ్చల్, మార్చి 21: సృజనాత్మకత పెంపునకు సాంకేతిక సదస్సులు దోహదం చేస్తాయని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి అన్నారు. రెండు రోజుల జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక, సాంస్కృతిక సంబురం 'అక్షర 2కే 24' గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సాంస్కృతిక, సాంకేతిక ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ప్రతి ఏటా అక్షర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోడింగ్ పోటీలు, హ్యాకథాన్, స్టూడెంట్ హాస్ గాట్ టాలెంట్, మిస్టర్ అండ్ మిసెస్ అక్షర వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సంబురంలో దాదాపు 10వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. క్లౌడ్ పర్ సీ సంస్థ ఉపాధ్యక్షుడు సుధీంద్ర కులకర్ణి మాట్లాడుతూ..ఇంజినీరింగ్ విద్యార్థులు సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అమెజాన్ సంస్థ మానవ వనరుల విభాగం అధికారి అనిల్ మాట్లాడుతూ.. గతేడాది 28వేల నియామకాలు చేపట్టామని, ఈసారి ఆ సంఖ్యను 30వేలకు పెంచనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు డాక్టర్ పిల్లా శ్రీనివాస్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ మోహన్ శ్రీనివాస్, డాక్టర్ వసంతకుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 21 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు)ఈ విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 65, ఆలుగడ్డ 21, కీరా 23, దోసకాయ 15, సొరకాయ 9, పొట్లకాయ (1) 15, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 20, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి(1) 4 నుంచి 6, మొరంగడ్డ 15, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని 51, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీ